సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 13 । జూన్ । 2023



ఫిర్యాదులపై సమీక్షిస్తూ..

సిరిసిల్లక్రైం: సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో 14 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. ఫిర్యాదులపై ఎస్పీ సమీక్షిస్తున్నారు.



మొక్కలు నాటాలి

బోయినపల్లి: హరిత ఉత్సవంలో భారీగా మొక్కలు నాటాలని డీఆర్డీవో గౌతంరెడ్డి కోరారు. మాన్వాడ, కొత్తపేట, వెంకట్రావుపల్లి గ్రామాల్లో స్థలాలను పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
39.0/30.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తాం : డీటీసీ



మాట్లాడుతున్న చంద్రశేఖర్ గౌడ్

తిమ్మాపూర్: పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులను తరలించే వాహనాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,629 విద్యాసంస్థల బస్సులు ఉండగా ఇప్పటివరకు కేవలం 817 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని తెలిపారు. మిగిలిన 812 బస్సులు కూడా సంబంధిత రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. 15 ఏళ్లు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై తిప్పొద్దని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆ వాహనాలను సీజ్ చేస్తామని, యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లాలో 818బస్సులకు 468, పెద్దపల్లి జిల్లాలో 249బస్సులకు 75, జగిత్యాల జిల్లాలో 427బస్సులకు 213, రాజన్న సిరిసిల్లలో 135 బస్సులకు 61బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయని వివరించారు. మిగిలిన బస్సులు కూడా త్వరలో ఫిట్‌నెస్ చేసుకోవాలని తెలిపారు. త్వరలో విద్యాసంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లతో సమావేశం నిర్వహిస్తామని డీటీసీ తెలిపారు.

సెస్ పరిధిలో మెరుగైన సేవలు



బోయినపల్లి(చొప్పదండి): సిరిసిల్ల సెస్ పరిధిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలందించేందుకు కృషి చేయనున్నట్లు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని సెస్ కార్యాలయం కోసం నూతన అద్దె భవనం పరిశీలించారు. రామారావు మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలపై స్పందించాలని సూచించారు. అంతకుముందు బోయినపల్లి సెస్ పరిధిలోని కొడిమ్యాల మండలం నల్లగొండ, తిప్పాయిపల్లి గ్రామాల ప్రజల సౌకర్యం కోసం ప్రత్యేక సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్, నాయకులు సంబ లక్ష్మీరాజం, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

14న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని ప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి ఈనెల 14న శంకుస్థాపన చేయనున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి కేటీఆర్ హాజరుకానున్నట్లు చెప్పారు. హెలీప్యాడ్‌తోపాటు, సభ నిర్వహణ స్థలాన్ని సోమవారం సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. ఆగయ్య మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.1.80 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. మరో రూ.1.20కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు అనుమతులు వచ్చాయన్నారు. మొత్తం రూ.3కోట్లతో ఆలయాన్ని నిర్మించనున్నట్లు వివరించారు. సర్పంచ్ వెంకటరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, తహసీల్దార్ జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన డీఈవో



ఇల్లంతకుంట/తంగళ్లపల్లి: పాఠశాలల్లోని భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈవో రమేశ్‌కుమార్ సూచించారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పాఠశాల భవనం, తంగళ్లపల్లి మండలంలోని బస్వాపూర్ ప్రభుత్వ పాఠశాలలను సోమవారం సందర్శించారు. మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలోని పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంఈవో బన్నాజీ, సర్పంచ్ పల్లె నర్సింహారెడ్డి ఉన్నారు.

తడబడి

- విద్యార్థులకు స్వాగతం పలికిన కూలిన గోడలు
- అసంపూర్తిగా మన ఊరు – మన బడి పనులు
- పునాదుల్లోనే నిర్మాణాలు
- వరండాలోనే కూర్చున్న స్టూడెంట్స్
- నిరుపయోగంగా మూత్రశాలలు
- తొలిరోజు హాజరు అంతంతే



❐ ఇది ఇల్లంతకుంట మండల జిల్లా పరిషత్ పాఠశాల. మన ఊరు – మన బడి కింద నూతన భవనాలు నిర్మిస్తామని పాత భవనాన్ని కూల్చి వేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనా పనులు పూర్తికాలేదు. విద్యార్థులు ఇసుకలోనే కూర్చున్నారు.



❐ ఇది ముస్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల. కాంపౌండ్‌వాల్‌తోపాటు కేజీ టు పీజీ విద్యాలయం పనులు చేస్తున్నారు. విద్యార్థులు కూర్చునేందుకు స్థలం లేక ఇలా వరండాలో కూర్చున్నారు.



సిరిసిల్లలోని గీతానగర్ మండల పరిషత్ స్కూల్‌లో కట్టెలపొయ్యిపై వంట చేస్తున్న నిర్వాహకురాలు



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ మండల పరిషత్ పాఠశాలలో ఐదు తరగతులలో దాదాపు 100 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ రెండే గదులు ఉన్నాయి. విద్యార్థులు చెట్ల కింద కూర్చొని చదువుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రహరీ కూలిపోయింది. రాత్రయితే చాలు మందుబాబులకు సిట్టింగ్ ప్లేస్‌గా మారిపోతుంది. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు.



❐ సిరిసిల్లలోని సుభాష్‌నగర్ పాఠశాల. ఇక్కడ కేంద్రీయ విద్యాలయం కొనసాగుతుండడంతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గదులు సరిపోవడం లేదు. చేసేదేమీ లేక రెండు గదుల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు.



❐ ఇక్కడ అసంపూర్తి పనులు ఉన్న స్కూల్ రుద్రంగిలోని హరిజనవాడ జెడ్పీ హైస్కూల్. మండలంలోని మానాల, దెగావత్, అడ్డబోర్‌తండా గ్రామాల్లోని ప్రైమరీ స్కూల్స్‌లలో మన ఊరు – మన బడి పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అడ్డాపూర్‌తండాలోనే పనులు పూర్తయ్యాయి. దెగావత్ తండా పాఠశాలలోని మూత్రశాలలకు తలుపులు లేవు.

సిరిసిల్లఎడ్యుకేషన్: కూలిన గోడలు.. డోర్లు లేని మరుగుదొడ్లు.. పూర్తికాని తరగతిగదులు.. కనిపించని తాగునీటి వసతి.. చాలీచాలని గదులు తొలి రోజు విద్యార్థులకు స్వాగతం పలికాయి. జిల్లాలోని చాలా పాఠశాలల్లో సమస్యలే ఎదురయ్యాయి. మన ఊరు – మన బడిలో భాగంగా చేపట్టిన పనులు పూర్తికాకపోవడంతో అసౌకర్యాల మధ్యే విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. గదులు సరిపోక లేక చాలా బడులలో వరండాలలోనే తరగతులు నిర్వహించుకోవడం కనిపించింది. ఈ సమస్యలు 'సాక్షి' సోమవారం నిర్వహించిన విజిట్‌లో వెలుగుచూశాయి.

అంతటా అసౌకర్యాలే..

జిల్లావ్యాప్తంగా మన ఊరు – మన బడిలో 172 పాఠశాలల్లో రూ.48కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు ప్రారంభించారు. వంద స్కూళ్లలో పనులు పూర్తికాగా మిగతా 72 పాఠశాలల్లో అసంపూర్తి పనులు ఉన్నాయి. చాలా బడులలో తరగతిగదులు సరిపోక వరండాలలో విద్యార్థులు కూర్చున్నారు. స్కూళ్లలో స్కావెంజర్స్ లేక పారిశుద్ధ్య పనులు చేయడం లేదు. ఫలితంగా మూత్రశాలల నుంచి దుర్వాసన వస్తోంది. తొలి రోజు కనీసం తరగతి గదులను ఊడ్చేవారు లేరు.

- వేములవాడలో 15 పాఠశాలలు మన ఊరు మన బడికి ఎంపికవగా.. 14 స్కూళ్లలో పనులు ప్రారంభించారు. నాంపల్లి, చీర్లవంచ పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. మిగతా పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. వేములవాడ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.28 లక్షలతో పనులు చేపట్టారు. స్కూల్ భవనానికి పెయింటింగ్, ఎలక్ట్రికల్ వర్క్ పూర్తయ్యాయి. పాఠశాల ముందు ఫ్లోరింగ్, టాయిలెట్లకు నీటి సరఫరా, వాష్‌బేసిన్ నల్లాకు నీటి సరఫరా, వంట గది ముందు రేకుల షెడ్డు, పాఠశాలల విద్యార్థులకు ఫర్నిచర్ సమకూర్చాల్సి ఉంది.

తొలిరోజు హాజరు అంతంతే..

- జిల్లాలో 510 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 48 వేల మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించే ప్రభుత్వ విద్యాలయాలు 19 ఉండగా ఇందులో 8 వేల మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో 122 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 22 వేల మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. తొలిరోజు సోమవారం జిల్లా వ్యాప్తంగా 45,097 మంది విద్యార్థులకు 27,781 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సినారె ప్రజల మనిషి



స్మృతివనం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

వేములవాడరూరల్: సి.నారాయణరెడ్డి ప్రజల మనిషి అని.. ఆయన, మా తండ్రి మంచి స్నేహితులు కావడంతో ఆయనను కలిసే భాగ్యం కలిగిందని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. హన్మాజిపేటలో సోమవారం నిర్వహించిన సినారె వర్ధంతికి హాజరై మాట్లాడారు. వేములవాడలోని సినారె భవనాన్ని రూ.10కోట్లతో సర్వాంగసుందరంగా నిర్మించనున్నట్లు తెలిపారు. సినారె కుటుంబసభ్యులు గంగ, కవి నలిమెల భాస్కర్, ఎస్‌యూ వీసీ మల్లేశం, సరస్వతీ పరిషత్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సర్పంచ్ జంకె విజయ, సెస్ డైరెక్టర్ దేవరాజం పాల్గొన్నారు.

నీళ్ల పండుగకి రండి

వేములవాడ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18న అగ్రహారం ఫిల్టర్‌బెడ్ వద్ద నిర్వహించే నీళ్ల పండుగకు హాజరుకావాలని కోరుతూ మిషన్ భగీరథ ఎస్ఈ రవీంద్ర, ఈఈలు జానకి, విజయకుమార్ ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు ఆహ్వానించారు.

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడికి..



ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్న విద్యార్థిని

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో సోమవారం ఓ విద్యార్థిని ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ బడిలో చేరింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని చేపట్టిన ఇంటింటా ప్రచారంలో ప్రైవేట్ పాఠశాలలు వద్దు..సర్కార్ పాఠశాలలే ముద్దు అనే నినాదానికి స్పందన వచ్చింది. ఎల్లారెడ్డిపేటకు చెందిన దీటి బాలలక్ష్మి–సతీశ్ దంపతుల కూతురు హర్షినిని 6వ తరగతిలో చేర్పించారు. విద్యార్థిని తల్లిని ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ సన్మానించారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వేములవాడ పట్టణాభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల: ఆధ్యాత్మిక కేంద్రం వేములవాడలో పట్టణాభివృద్ధి, సుందరీకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. నందికమాన్ కూడలి అభివృద్ధికి రూ.కోటి కేటాయించామని, సుందరీకరణ పనులు, ప్లాజా ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. రూ.1.98కోట్లతో వేములవాడ బ్రిడ్జి నుంచి వైకుంఠధామం వైపు నిర్మిస్తున్న 330 మీటర్ల మూలవాగు కట్టను, సుందరీకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.31.80 లక్షలతో తిప్పాపూర్ గోశాల వద్ద నిర్మిస్తున్న బయోగ్యాస్‌తో విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును పూర్తి చేయాలన్నారు. ప్లాంటు పూర్తయిందని ట్రయల్ చేస్తున్నట్లు అధికారులు వివరించారు. రూ.2.91 కోట్లతో నిర్మించే కోరుట్ల బస్టాండు నుంచి మల్లారం రోడ్డు కూడలి, భీమేశ్వర గార్డెన్ వరకు పుట్‌పాత్‌ల పనులను పూర్తి చేయాలన్నారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ, మినీ ట్యాంక్ బండ్, శివార్చన స్టేజీ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఈఈ తిరుపతి, ఏఈలు నరసింహ, నర్మద పాల్గొన్నారు.

భూవివాదంలో యువకుడి ఆత్మహత్యాయత్నం

- ముస్తాబాద్‌లో అడ్డుకున్న పోలీసులు
- ఇరువర్గాలపై కేసులు



పురుగుల మందు డబ్బాను లాగుతున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): భూ సమస్య పరిష్కారం కావడం లేదంటూ మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన ధరంసోత్ రవినాయక్(34) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అడ్డుకున్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. సేవాలాల్‌తండాకు చెందిన ధరంసోత్ రవినాయక్, ధరంసోత్ బాల్‌రెడ్డి నాయక్ ఇద్దరు సోదరులు. వీరి మధ్య కొంతకాలంగా భూవివాదం ఉంది. రవి, బాల్‌రెడ్డి తండ్రులు చాలా ఏళ్ల క్రితమే భూములు పంపిణీ చేసుకున్నారని, అయితే బాల్‌రెడ్డికి 15 గుంటల స్థలం అదనంగా పోయిందని రవినాయక్ కొన్నాళ్లుగా అభ్యంతరాలు చెబుతున్నాడు. ఈ విషయంపై నెల క్రితం బాల్‌రెడ్డి విద్యుత్‌స్తంభం ఎక్కగా, పక్షం రోజుల క్రితం రవినాయక్ సెల్‌టవర్ ఎక్కారు. పెద్దమనుషుల మధ్య జరిగిన పంచాయితీలో తీర్మానాన్ని ఇద్దరు ఒప్పుకున్నారు. ఈ క్రమంలో రవినాయక్ వివాదంలో ఉన్న భూమిని దున్నగా, బాల్‌రెడ్డి కూడా సోమవారం అదే భూమిని దున్నాడు. దీన్ని గమనించిన రవినాయక్ తరఫు వారు అడ్డుకున్నారు. దీంతో అక్కడి నుంచి ముస్తాబాద్‌కు వచ్చిన రవినాయక్ పురుగుల మందు డబ్బాతో తెలంగాణచౌక్‌లో ఆందోళన చేశాడు. సమాచారం అందుకొని అక్కడికెళ్లి మందు తాగకుండా రవినాయక్‌ను అడ్డుకున్నాం. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య పెనుగులాట జరిగింది. అయితే తామే రవినాయక్‌పై చేయి చేసుకున్నామని సోషల్‌మీడియాలో వైరల్ కావడం సరికాదన్నారు. రవి ఆత్మహత్యకు పాల్పడకుండా అడ్డుకున్నట్లు స్పష్టం చేశారు. దీనిపై ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి, కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ ఉపేందర్ ముస్తాబాద్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

యువత సన్మార్గంలో నడవాలి



2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్



2కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులతో జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎస్పీలు

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- సిరిసిల్లలో ఉత్సాహంగా 2కే రన్
- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీలు

సిరిసిల్ల: యువత సన్మార్గంలో ముందుకుసాగాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. సిరిసిల్లలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం 2కే రన్ నిర్వహించారు. అరుణ మాట్లాడుతూ రాష్ట్రం దశాబ్దకాలంలో ఎంతో ప్రగతి సాధించిందన్నారు. ఆరోగ్యానికి వ్యాయామం, యోగా, వాకింగ్ ముఖ్యమన్నారు. చదువుపై దృష్టిసారించి యువత లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని, ఫిట్‌నెస్ అందరికీ అవసరమన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసులు చేపట్టిన 2కే రన్ విజయవంతమైందని అభినందించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఈ దశాబ్ది స్ఫూర్తితో మరో దశాబ్దానికి ప్రణాళిక వేసుకుని ముందుకుసాగాలన్నారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, ఏఎస్పీ చంద్రయ్య, 17వ బెటాలియన్ కమాండెంట్ జయరాజు, జిల్లా యువజన, క్రీడల అధికారి ఉపేందర్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారధి, తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, బీఆర్‌ఎస్ నాయకులు చీటి నర్సింగారావు, జిందం చక్రపాణి, సీఐలు అనిల్‌కుమార్, ఉపేందర్, మొగిలి, వెంకటేశ్, రజనీకాంత్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 2కే రన్

సిరిసిల్ల నేతన్నచౌక్‌లో కలెక్టర్, ఎస్పీలు జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. నేతన్న చౌక్ నుంచి అంబేడ్కర్ సర్కిల్, గాంధీచౌక్ మీదుగా బతుకమ్మ ఘాట్ వరకు రన్ కొనసాగింది. వివిధ స్లోగన్స్‌లో ప్లకార్డులు పట్టుకుని పరుగులు తీశారు. పోలీసులు అందరికీ టీషర్ట్ ఇవ్వడంతో 2కే రన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకల ముగింపు సందర్భంగా పాల్గొన్న వారికి మెడల్స్ అందించారు.

వైద్య, ఆరోగ్య ప్రగతిని చాటిచెప్పాలి

- 14న వైద్య, ఆరోగ్యశాఖ దినోత్సవం
- మహిళా సంక్షేమం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్, అధికారులు

సిరిసిల్ల: జిల్లాలో వైద్యారోగ్యశాఖ సాధించిన ప్రగతి చాటిచెప్పాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. జిల్లా ఆస్పత్రిలో జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావుతో కలిసి 14న నిర్వహించే వైద్యారోగ్యశాఖ దినోత్సవంపై సోమవారం సమీక్షించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ వస్తున్నారని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. పర్యవేక్షకుడు మురళీధర్‌రావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లలో మంగళవారం నిర్వహించే మహిళా సంక్షేమ దినోత్సవం పోస్టర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ క్యాంపు ఆఫీస్‌లో ఆవిష్కరించారు. సిరిసిల్లలో పద్మనాయక కల్యాణ మండపం, వేములవాడలో మహారాజా ఫంక్షన్‌హాల్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సీడీపీవో ఎల్లయ్య, వుమెన్ ఎంపవర్‌మెంట్ కో–ఆర్డినేటర్ రోజా, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

మంచినీళ్ల పండుగకు ఆహ్వానం

ఈనెల 18న నిర్వహించే మంచినీళ్ల పండుగకు రావాల్సిందిగా జెడ్పీ చైర్‌పర్సన్ అరుణకు మిషన్ భగీరథ అధికారులు సోమవారం ఆహ్వానించారు. అగ్రహారం ఫిల్టర్‌బెడ్స్ వద్ద నిర్వహించే వేడుకల్లో పాల్గొనాలని మిషన్ భగీరథ ఎస్ఈ కె.రవీందర్, ఈఈలు జానకి, విజయ్‌కుమార్ ఆహ్వానపత్రాన్ని అందించారు.

శివోహం

వేములవాడ: రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. కళాభవన్‌లో కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాల మొక్కులు చెల్లించుకున్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. పర్యవేక్షకులు నటరాజ్, శ్రీరాములు, ఎడ్ల శివ, అర్చకులు ఉన్నారు.



ఆలయంలో భక్తుల రద్దీ



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

క్లుప్తంగా

జిల్లెల్లలో బొడ్రాయి ప్రతిష్ఠ ఏర్పాట్లు



జిల్లెల్లలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఏర్పాట్లను సోమవారం గ్రామ నాయకులు పరిశీలించారు. ఇప్పటికే బొడ్రాయిని గ్రామంలోకి తరలించగా ఆలయ సమీపంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బొడ్రాయికి పూజలు చేసి నీళ్లతో అభిషేకించారు. సింగిల్‌విండ్ చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, నాయకులు ఆసరి బాలరాజు పాల్గొన్నారు.

కార్పెంటర్ షాపులో షార్ట్ సర్క్యూట్



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన మిషనరీ, కలప

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలోని సాయినగర్‌లో మామిడిపల్లి రాములుకు చెందిన కార్పెంటర్ షాపులో సోమవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో మంటలు చెలరేగి దుకాణంలోని మిషనరీ, టేకు కలప కాలిపోయింది. దాదాపు రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న విశ్వకర్మ కార్పెంటర్ వెల్ఫేర్ సొసైటీ పట్టణాధ్యక్షుడు రేవోజు ప్రవీణ్‌చారి దుకాణాన్ని పరిశీలించారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని ఓ ఇంట్లోకి ప్రవేశించి సెల్‌ఫోన్‌లు దొంగతనం చేసిన ఇద్దరిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం యాడారం గ్రామానికి చెందిన ఈశ్వర్‌ప్రసాద్, దుర్గారావులను పెట్రోలింగ్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై గతంలో దొంగతనాల కేసులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

వేములవాడఅర్బన్: వేములవాడలో సోమవారం ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ, సుమిత్ర, వివేకానంద జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 122కు పూర్తిగా హాజరుకాగా.. సెకండియర్ విద్యార్థులు 103 మందికి 102 మంది హాజరైనట్లు వివరించారు.

ఘనంగా గంగమ్మ బోనాలు







రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సోమవారం గంగమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ చేశారు. మహిళలు బోనాలతో తరలిరాగా.. బైండ్లవాళ్ల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. రుద్రంగి గంగపుత్ర దుబాయి సంఘం ఆధ్వర్యంలో రూ.5లక్షలతో నిర్మించిన వాటర్‌ట్యాంక్‌ను ప్రారంభించారు. ఎంపీపీ గంగం స్వరూపారాణి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు చిట్టపురం గంగాధర్, ఉపాధ్యక్షుడు గాజె నర్సయ్య, కోశాధికారి ఎల్ల గంగాధర్, కార్యవర్గ సభ్యులు దేశవేని గంగాధర్, ద్యావల శంకర్, గంగారాం, గాజె భూమయ్య, గణేశ్, గంగపుత్ర దుబాయి సంఘం సభ్యులు దేశవేని శ్రీనివాస్, ఆర్మూర్ నర్సయ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఏం సాధించారని సంబరాలు

- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

విద్యానగర్(కరీంనగర్): ప్రజలను మభ్యపెడుతూ సంబరాలు చేయడం కాదని, వాస్తవాలకు అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన దశాబ్దంలో దొర కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. చదువుకున్నోడికి నౌకరీ లేదు, చదువులేనోడికి కులవృత్తిలేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో రూ.60వేల కోట్ల అప్పు ఉంటే.. ఇప్పుడు రూ.5,60,000 కోట్లకు చేరిందన్నారు. ధర్మారం మండలం స్తంభంపల్లిలో విత్తనాలు ఫ్యాక్టరీ ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలతో ఆడుకోవడం మాని రైతుల కోసం చక్కెర ఫ్యాక్టరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇథనాలు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజల అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో ప్రతి క్వింటాల్‌కు తరుగు పేరున 5కిలోలు ఎక్కువ తూకంవేయడంతో రైతులు క్వింటాకు రూ.100 నష్టపోతున్నారని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటివరకు డబ్బులు ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ఇద్దరు సంక్షేమశాఖల మంత్రులున్నప్పటికి జిల్లా ప్రజలకు జరిగిన మేలు ఏమిలేదన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరిట ఆర్భాటాలు చేయడం ఆశ్చర్యకరంగా ఉందని, ఉద్యమ ఆకాంక్షలు ఏం నెరవేరాయో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గానికి వందమంది చొప్పున దళితబంధుకు రూ.15.700 కోట్ల బడ్జెట్ శాసనసభలో ఆమోదం పొందినా.. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. నాయకులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారిపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు

- డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్లక్రైం: నిరుపేద రైతును ముస్తాబాద్ ఎస్సై కొట్టారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి సోమవారం తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలంలోని సేవలాల్ తండాకు చెందిన ధరంసోత్ రవి కుటుంబ సభ్యులకు, ధరంసోత్ బాలరాజ్ కుటుంబ సభ్యులకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ గురుంచి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయకుండా ధరంసోత్ రవి అతని కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ముస్తాబాద్‌లోని తెలుగుతల్లి విగ్రహం వద్ద రోడ్డుపై కూర్చున్నారు. పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ విషయం తెలుసుకున్న ముస్తాబాద్ ఎస్సై వెంకటేశ్వర్లు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని.. రవిని కాపాడాలనే ఉద్దేశ్యంతో అతని చేతిలో ఉన్న మందు డబ్బాను గుంజుకున్నాడే కానీ చేయి చేసుకోలేదని స్పష్టం చేశారు. దీన్ని కొందరు సోషల్ మీడియాలో చెడుగా చూపిస్తూ పోలీసులు దాడి చేశారని, రైతును కొట్టి లాక్కెళ్లారని పోలీసులు తప్పు చేసినట్లుగా వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఎదునూరి భాను, గజ్జెల రాజు, రంజాని నరేశ్, పెద్దాని మహేందర్ ప్రచారం చేశారు. అసత్య ప్రచారాలు చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

విజ్ఞాన్‌లో విద్యార్థుల సంబురాలు



ఎల్లారెడ్డిపేటలోని విజ్ఞాన్ స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం నూతన విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల కరెస్పాండెంట్ మహ్మద్ లతీఫ్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. గత సంవత్సరం పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణతతో పాటు ముగ్గురు విద్యార్థులు పది జీపీఏ సాధించి పాఠశాలకు పేరు తీసుకొచ్చారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. హెచ్‌ఎంలు శరత్‌కుమార్, సంతోష్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈవీఎంల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని మార్కెట్ కమిటీ యార్డులో ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ సోమవారం ప్రారంభమైంది. ఈ తనిఖీలను కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ తనిఖీలు ఈనెల 19వ తేదీ వరకు చేపట్టాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరుగుతోంది

- సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో సోమవారం జరిగిన పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శ రాములు, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం తెచ్చేందుకు వెళ్తూ..

- మూలమలుపు వద్ద అదుపు తప్పిన ద్విచక్ర వాహనం
- ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మహేశ్(ఫైల్)

మంథని: మిత్రులతో క్రికెట్ ఆడుతుండగా.. రైస్ మిల్లుకు వెళ్లి బియ్యం బస్తా తీసుకురావాలని తల్లి పురమాయించడంతో, స్నేహితుడితో ద్విచక్రవాహనంపై వెళ్తూ.. ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని నాగారం శివారులో జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, స్థానికుల వివరాలు.. మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన వేముల సమ్మయ్యకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. సమ్మయ్య అనారోగ్యంతో మృతిచెందగా, భార్య శ్యామల కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని సాకుతుంది. ఆమె కొడుకు వేముల మహేశ్(24) సోమవారం క్రికెట్ ఆడుకుంటుండగా బియ్యం తీసుకురావాలని తల్లి చెప్పడంతో అదే గ్రామానికి చెందిన గుర్రాల వంశీతో కలిసి మండలంలోని కన్నాల రైస్ మిల్లుకు బయలుదేరారు. నాగారం శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. మహేశ్‌కు తీవ్ర గాయాలైనాయి. మంథని సామాజిక వైద్యశాలకు తరలించగా మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వంశీకి ప్రథమ చికిత్స అందించి గోదావరిఖనికి తరలించారు. కాగా మహేశ్ మంచిర్యాల జిల్లా జైపూర్ విద్యుత్ ప్లాంట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనాథ మహిళకు అరుదైన వైద్యం

- చందన చెస్ట్ క్లినిక్‌లో ఉచిత చికిత్స



రోగితో డాక్టర్ చందనరెడ్డి

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని అనంత్‌నగర్ చందన చెస్ట్ క్లినిక్‌లో అనాథ మహిళకు అరుదైన వైద్యసేవలు అందించారు. 26 ఏళ్ల అనాథ మహిళ చాతిలో నొప్పి, జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరింది. పరీక్షలు చేయగా ఊపిరితిత్తుల్లో నీరు చేరినట్లు డాక్టర్ చందనరెడ్డి గుర్తించారు. వైద్యం చేయించుకోవాలని డాక్టర్ సూచించగా.. తాను అనాథ అని, డబ్బులు లేవని చెప్పడంతో మానవత్వంతో స్పందించిన డాక్టర్ పైపుద్వారా మందును చాతిలోకి పంపించి ఊపిరితిత్తుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. హైదరాబాద్ కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల్లో చేసే ఊపిరితిత్తుల అరుదైన వైద్యాన్ని సిరిసిల్లలో తొలిసారి నిర్వహించినట్లు డాక్టర్ సోమవారం తెలిపారు. ఉచితంగా వైద్యసేవలు అందించిన డాక్టర్‌కు సదరు మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

బజార్‌లోనే బడీడు పిల్లలు



సెస్ ఆఫీస్ రోడ్డుపై తిరుగుతున్న బడీడు పిల్లలు

వేములవాడ: బడులు ప్రారంభమైనప్పటికీ వేములవాడ పట్టణంలోని రోడ్లపై ఇంకా బడీడు పిల్లలు తిరుగుతూనే ఉన్నారు. సోమవారం ఇలా చిన్నారుల గుంపులుగా సెస్ ఆఫీస్ ముందు తిరుగుతూ కనిపించారు.

చికెన్ తగ్గేదేలే..

- కిలోకు రూ.300
- చాలా ఏళ్ల తర్వాత రికార్డు ధర
- ఎండలకు చనిపోతున్న కోళ్లు
- నిర్వాహకులకు భారంగా పెంపకం



బ్రాయిలర్ ఫారంలో కోళ్లు

బోయినపల్లి(చొప్పదండి): చికెన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. కొన్నేళ్ల తర్వాత చికెన్ ధరలు పెరగడంతో సామాన్యులు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా కిలో చికెన్ రూ.300 ఆపైనే ఉంటుంది. ఎండాకాలం కావడం.. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో కోళ్లను కాపాడడం నిర్వాహకులు ఇబ్బందిగా మారింది. కోళ్ల దాణా ధరలు పెరగడం, అధిక ఉష్ణోగ్రతలకు కోళ్లు చనిపోతుండడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి.

రికార్డు స్థాయిలో చికెన్ ధరలు

గత ఐదేళ్లుగా చికెన్ ధరలు రూ.300 దాటిన దాఖలాలు లేవు. ప్రస్తుత వేసవి సీజన్‌లో డిమాండ్‌కు సరిపడా కోళ్లు లేకపోవడంతో ధరలు ఆకాశాన్నంటాయి. కోడిపిల్లలను ఫామ్‌లో వేసిన తర్వాత సుమారు 40 రోజుల వరకు పెంచాలి. సాధారణ సీజన్‌లలో 40 రోజుల సమయానికి కోడి రెండు కేజీల వరకు బరువు పెరుగుతుంటుంది. వేసవిలో మాత్రం 45 రోజులకు రెండు కేజీల వరకు పెరుగుతుంది. కోళ్ల మొటాలిటీ (చనిపోవడం) లేకపోతే ఈ విధంగా ఉంటుంది. రెండు కేజీల వరకు కోడి ఎదగాలంటే ఒక కోడి వెంట రూ.200 వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని కోళ్ల ఫారం యజమానులు తెలిపారు. స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.340 పలుకుతుంటే, స్కిన్‌తో రూ.290, లైవ్ కోడి కేజీ రూ.210 విక్రయిస్తున్నారు. గత కొన్ని నెలలుగా చికెన్ ధర రూ.300 దాటని దాఖలాలు లేవు. ఈ వేసవిలో మాత్రం ధరలు భారీగా పెరిగాయి. గత ఏప్రిల్‌లో కిలో చికెన్ దాదాపు రూ.240, మే నెలలో రూ.270 వరకు పలుకగా.. ప్రస్తుతం జూన్ మొదటి వారంలో రూ.320 నుంచి రూ.340 వరకు చేరింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నాడు 350 క్వింటాళ్ల వరకు చికెన్ వినిగిస్తుంటారు. మిగతా రోజుల్లో మాత్రం నిత్యం 200 క్వింటాళ్ల వరకు వినియోగిస్తుంటారు. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి కోళ్ల దిగుమతి అవుతున్నట్లు చికెన్ సెంటర్ యజమానులు చెబుతున్నారు.

ధర చూస్తే దడ పుడుతోంది



వేసవి సెలవులకు పిల్లలు అందరూ ఇంట్లోనే ఉంటున్నారు. ఒక పూట కిలో చికెన్ తెచ్చుకుందామంటే ధరలు చూస్తే దడ పుడుతోంది. సామన్యులకు అందుబాటులో ఉండే చికెన్ ధరలు ఒక్కసారిగా పెరగడం ఇబ్బందిగా మారింది.

– మెరుపుల సంగీత, బోయినపల్లి

గిరాకీ తగ్గుతోంది



నేను నాలుగేళ్లుగా చికెన్ సెంటర్‌తో ఉపాధి పొందుతున్నాను. చికెన్ ధరలు పెరడగంతో గిరాకీ తగ్గుతోంది. గతంలో కేజీ చికెన్ తీసుకువెళ్లే వారు ఇప్పుడు అర కిలో చికెన్ తీసుకెళ్లి సర్దుకుంటున్నారు. మార్కెట్‌లో కోళ్ల లేకపోవడం, ఎండలకు కోళ్లు పెరగకపోవడంతో చికెన్ ధరలు పెరిగాయంటున్నారు.

– దూస లక్ష్మణ్, చికెన్ సెంటర్ వ్యాపారి, బోయినపల్లి

వామ్మో ఎండ







వేములవాడ: జిల్లాలో సోమవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం వేళ బయటకు వచ్చేందుకు జనం భయపడ్డారు. వేములవాడలో అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు తువ్వాలు కప్పుకొని తిరగడం కనిపించింది. వడగాలులు వీస్తుండడంతో నెత్తిపై తువ్వాలు, గొడుగులు పట్టుకొని బయటకు వచ్చారు.